క్లుప్తంగా

నేడు మావుళ్లమ్మ ఆలయానికి పాదయాత్ర

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రు శ్రీ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ, శ్రీ లలితా పారాయణ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6:20గంటలకు భీమవరం మావుళ్లమ్మ సన్నిధికి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, విద్యా, ఆధ్యాత్మిక వేత్త ఎంఎస్ వాసు తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద హారతి, పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకుని 7 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 5గంటలకు భీమవరం మావుళ్లమ్మను దర్శించుకోనున్నట్లు ఆయన తెలిపారు. పాదయాత్రలో సుమారు 220 మంది భక్తులు పాల్గొంటున్నట్లు ఆయన చెప్పారు.

పేదలకు అన్నదానం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఫైర్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బొక్కా వెంకటరమణ తమ సేవా సంస్థ ద్వారా శనివారం పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. వెంకటరమణ మాట్లాడుతూ తన స్వగ్రామం ములపర్రులో శ్రీకృష్ణ సాయిసేవా సంఘం స్థాపించానని ఆ సేవా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. దానిలో భాగంగా పట్టణంలో పేదలకు అన్నదానం ఏర్పాటు చేసి దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకిరామ్, పితాని వెంకన్న, డీసీహెచ్ హనుమంతురావు, బొక్కా అరుణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ నూతన భవనం పరిశీలన


నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మునిసిపల్ కార్యాలయం ఆవరణలో వెనుక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని మునిసిపల్ కమిషనర్ నెల్లుట్ల ప్రమోద్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ రూ. 18 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం, మెప్మా, ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన సెక్షన్ భవనాలు శిథిలమవ్వడం, అంతే కాకుండా 4వ సచివాలయం కూడా మునిసిపల్ కార్యాలయంలోనే ఉండడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యాలయం వెనుక నిర్మాణం జరుగుతున్న భవనంలో పట్టణ ప్రణాళికా విభాగం, మెప్మా, సచివాలయ సెక్షన్‌లను ఈ నూతన భవనంలో ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లాన్ ఆఫీసర్ వీర బ్రహ్మం, డిఈ సాంబశివుడు, టీపీఎస్ త్రినాథ్, జె1 సతీష్ పాల్గొన్నారు.

సారా కేసులు నమోదు

ఉండి: ఉండి మండలం వెలివర్రు గ్రామానికి చెందిన ఓ మహిళపై అధికారులు సారాకు సంబంధించి రెండు కేసులు నమోదు చేశారు. వెలివర్రులో ఓ మహిల ఇంటి వద్ద నాటుసారా ఉందనే సమాచారంతో డీటీఎఫ్, ఎస్ఈబీ సీఐ కె.కోటేశ్వరరావు, ఎస్సై ఎం రామస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం దాడి చేసి లీటరు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం మరోసారి ఆమె ఇంటివద్ద దాడి చేసి 50 లీటర్ల బెల్లపు ఊటను మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ మేరకు ఆకివీడు ఎస్ఈబీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. నిందితురాల్ని అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

దుర్గాపురం మున్సిపల్ పాఠశాల తనిఖీ

సాక్షి, భీమవరం: పట్టణంలోని దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను శనివారం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ రాష్ట్ర పరిశీలకురాలు ఆర్ఎస్ గంగాభవాని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భం ఆమె మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేస్తుందని పాఠశాలలో ఐసీటీ, స్పోర్ట్స్‌తో పాటు మౌలిక సదుపాయాలను ఏర్పరచుకోడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. దుర్గాపురం మున్సిపల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ బాబాజీ సాహెబ్ సమర్పించిన రికార్డులను, ఫొటోలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట సమగ్ర శిక్ష ఏ ఎం ఓ ఎంఎన్ శ్రీమన్నారాయణ, ఏఎస్ఓ సిహెచ్ఎస్ వి సుబ్రహ్మణ్యం, మండలవిద్యాశాఖాధికారి బి.వినాయకుడు పాల్గొన్నారు.

వచ్చే నెల 6 నుంచి జాతీయస్థాయి హేక్‌థాన్

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6 నుంచి వారం రోజులుపాటు జాతీయ స్థాయిలో బూట్ క్యాంప్, 24 గంటల హేకథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.హేమలత మాట్లాడుతూ జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన బ్రెయినోవిజన్ సాంకేతిక సంస్థ సంయుక్త సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నరసాపురంలో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం


లక్ష్మణేశ్వరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రసాదరాజు


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్

- హాజరైన మంత్రులు
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

నరసాపురం రూరల్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నరసాపురం నియోజకవర్గంలో శనివారం అట్టహాసంగా ముగిసింది. తొలుత మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో రూ.79.30 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను రాష్ట్ర మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్‌లు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్థానిక ఎమ్మెల్యే ప్రసాదరాజు మాట్లాడుతూ లక్ష్మణేశ్వరం గ్రామంలో ఈ మూడున్నరేళ్ల కాలంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి రూ.25 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రతిపక్షాలు మొదట్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంపై బురద జల్లేందుకు ప్రయత్నించాయని, అనంతరం వారే వివిధ పేర్లు పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వారి హయంలో చేసిందేమీ లేకపోయినప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మంత్రులు నాగార్జున, రమేష్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించుకోవడంలో ప్రసాదరాజు ముందుంటారన్నారు. ఇటీవలే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని నరసాపురం నియోజకవర్గ పర్యటనకు తీసుకు వచ్చి సుమారు రూ.3,200కోట్ల అభివృద్ధి పనులను శ్రీకారం చుట్టించారన్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ జేవీ మురళి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సచివాలయ వ్యవస్థ, భూ రీసర్వే తదితర వాటిని గురించి వివరించారు. జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్నకార్యక్రమాలను వివరిస్తూ మాట్లాడారు. మొదటగా మంత్రులతో రూ.20 కోట్లతో చేపట్టనున్న లక్ష్మణేశ్వరం నుంచి పెదమైనవానిలంక బీటీ రహదారి, రూ.3 కోట్లతో నిర్మించనున్న నరసాపురం నుండీ కరింశెట్టిపాలెం బీటీ రహదారి నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. రూ.4.24 కోట్లతో ఇంటింటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు పెండ్ర వీరన్న, బర్రి లీల, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, చాగంటి సత్యనారాయణ, పీడీ రాజు, ఉంగరాల రమేష్‌నాయుడు, తిరుమాని వెంకట్రాజు, మత్తేసువర్ణరాజు, అంద్రాజు చల్లారావు, దొంగ మురళీకృష్ణ, దేశంశెట్టి సురేష్, కడలి ఆదినారాయణ, పెమ్మాడి సుధాకర్, మద్దుల సురేష్, కవురు ఆంజనేయులు, చాగంటి నాని, తోట శేఖర్, కడలి పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలను నిర్వహిస్తే కఠిన చర్యలు


వదలిలో మాట్లాడుతున్న అధికారులు

పెనుగొండ: కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పెనుగొండ ఎస్సై ఎస్ఎస్‌వీవీ రమేష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్ ఆదేశాలతో పెనుగొండ, దొంగరావిపాలెం, వడలి, సిద్ధాంతం, ములపర్రుల్లో అవగాహన సదస్సులు నిర్వహించి నిబంధనలు అతిక్రమించవద్దని హెచ్చరించారు. సంక్రాంతికి సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.గురుమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

వల్లూరులో

సంక్రాంతి సందర్భంగా సాంప్రదాయ క్రీడలు నిర్వహించాలని పాలకొల్లు ఎస్ఈబీ సీఐ ఎల్ చిరంజీవి అన్నారు. శనివారం ఆచంట మండలం వల్లూరులో జూద క్రీడలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై బి.ప్రసాద్ పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులను పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వర్లు

నరసాపురం రూరల్: రైతులు మేలైన వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునని జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని సరిపల్లి రైతు భరోసా కేంద్రంలో నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు మండలాలకు చెందిన రైతు భరోసా కేంద్ర సిబ్బందికి శనివారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా సిబ్బంది రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తుండాలన్నారు. వరి సాగులో మేలైన పద్ధతులను తెలియజేస్తూ నత్రజని ఎరువుల వాడకాన్ని 57 శాతం మించకుండా చూడాలన్నారు. అధిక ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించాలన్నారు. రైతులందరికీ పంటల బీమా వర్తించేలా చూడాలని వివరించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దుర్గేష్ మాట్లాడుతూ కొబ్బరి, మామిడి, కూరగాయల పంటలపై ఎరువుల వినియోగం, మేలైన సాగు పద్ధతులను వివరించిచారు. కార్యక్రమంలో ఏడీఏ అనిల్‌కుమారి మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహిస్తూ రైతులకు మేలైన సాగు పద్ధతులను అవలంభించేలా సహకరించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ అధికారులు ఎం సామ్యూల్ జాన్సన్, సీహెచ్ దేవి, ఎం.సుజాత తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వెంకటేశ్వరస్వామిని ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ధనుర్మాసం సందర్భంగా ప్రతీరోజూ వేకువజామునే స్వామి వారికి విశేష సేవలు చేస్తున్నారు. అభిషేకాలు, పూజలు చేస్తున్నారు. ప్రసాద వియోగం, సేవలు చేయడంతోపాటు ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ప్రతి రోజూ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరిస్తూ తిరుప్పావై ప్రవచనాలను భక్తులకు వినిపిస్తున్నారు.


ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఉషాలక్ష్మీకుమారి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఉషా లక్ష్మీకుమారి తెలిపారు. శనివారం కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉషా లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఫిబ్రవరి 11న కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ చేసుకునే కక్షిదారులు ముందుగా కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సేవా సంస్థ కార్యాలయంలో తమ వివరాలు తెలియజేయాలన్నారు. ఏపీపీ జయసింధు, జీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా ఇచ్చిన సీఎం జగన్


యాళ్లవానిగరువులో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: ప్రతి కుటుంబానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పించారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. పాలకొల్లు మండలం యాళ్లవానిగరువు సచివాలయంలో కొత్త పింఛన్ లబ్ధిదారులకు ఆయన పింఛన్లు సొమ్ము అందజేసిన సందర్భంగా మాట్లాడారు. బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరచిన విధంగా ఆర్థిక అసమానతలు రూపుమాపి, సమసమాజ స్థాపనకు సీఎం జగన్ పాటు పడుతున్నారన్నారు. గత మూడున్నరేళ్లలో సీఎం జగన్ ప్రజలకు అందించిన సంక్షేమం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న కొన్ని పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేయడానికి ఆయా ముఖ్యమంత్రులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా యాళ్లవానిగరువు సచివాలయం –1లో 12 మందికి, సచివాలయం –2లో 9 మందికి పింఛన్లు సొమ్ములను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్కా ఇర్మియారాజు, మాజీ సర్పంచ్ గంటా నరేష్‌బాబు, నల్లి నాగరాజు, సబ్బే శ్రీను, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి పవన్‌కుమార్, పంచాయతీ సిబ్బంది, శివ, రాంబాబు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి పింఛన్ అందజేత


పింఛన్ అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక 16వ వార్డుకు చెందిన దేవతట్ల రవికుమార్‌కు రెండు కిడ్నీలు పాడైపోయి బాధపడుతున్నారని వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుణ్ణం సురేష్ తెలిపారు. శనివారం అతని ఇంటికి వెళ్లి ప్రభుత్వ మంజూరు చేసిన రూ. 10 వేలు పింఛన్‌ను అందజేశారు. సురేష్ మాట్లాడుతూ గత ఏడు నెలల్లో రెండు సార్లు డయాలసిస్ చేయించుకున్నారన్నారు. సచివాలయ అడ్మిన్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మత్స్యకారుల నిరసన

పెనుగొండ: గోదావరిలో నీరు రాకుండా ర్యాంపుల కోసం అడ్డుకట్టలు వేయడం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని మత్స్యకార సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధాంతంలో ర్యాంపు నిర్మాణాన్ని అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. గోదావరిలో అడ్డుకట్టలు వేయడం వల్ల మత్స్య సంపద రాకుండా పోతుందన్నారు. కర్రి కనకరాజు, కొండలరావు, అర్జునరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించాలి


పెనుమర్రులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పెదపాటి పెద్దిరాజు

యలమంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలలో గృహనిర్మాణానికి అగ్రతాంబూలం ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని గృహనిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు చెప్పారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం పెనుమర్రు గ్రామంలోని జగనన్న కాలనీల్లో ఆయన పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి వదిలేయకుండా స్థలం మెరక చేసి, తాగునీరు, విద్యుత్, రోడ్ల సౌకర్యం కల్పించారన్నారు. అయినా ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు తాత్సారం చేయడం సమంజసం కాదన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట సర్పంచ్ కవురు గోపి, గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారణాసి సుబ్రహ్మణ్య సిద్ధాంతి, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఇన్‌చార్జి ఏఈ కంకిపాటి రాజారాం, హౌసింగ్ వర్క్ఇన్స్‌పెక్టర్స్ మత్తే బాబ్జి, పుప్పాల పల్లపురాజు, గ్రామ కార్యదర్శి పితాని రాజశేఖర్, డ్వాక్రా సీఏ అల్లవరపు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలతో ముందుకెళ్లాలి


పెనుగొండ విశ్వతేజలో రవీంద్ర ను సత్కరిస్తున్న డాక్టర్ కేఆర్ రాజు


పెనుగొండ: యువత నూతన దృక్పథంతో ముందుకు సాగుతూ పారిశ్రామికంగా, ఆర్థికంగా బలపడాలని ఎస్ఎంఎంఈ కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ అన్నారు. శనివారం పెనుగొండ విశ్వతేజలో నెహ్రూ యువకేంద్ర యువజన వ్యవహారాలు, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, వారధి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌ల సంయుక్తంగా నిర్వహించిన యువత నాయకత్వ లక్షణాలపై జరిగిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదిమానవుడు కాలం నుంచి రాయిరాయి రుద్ది ఆయుధాన్ని తయారు చేయడం నాటి నుంచి అభివృద్ధి ప్రారంభమైందన్నారు. నూతన ఆలోచనలతో యువత ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. ఎస్ఎస్ఎంఈ ద్వారా చిన్న తరహ వ్యాపారాలకు, పరిశ్రమలకు ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ పోడూరి గోవర్ధన, సిఐ జీవీవీ నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది అనుకుల రమేష్, ఎంపీడీవో డీబీఆర్ కృష్ణంరాజు, వారధి కన్వీనరు కామాక్షీ రవి, కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్, కరస్పాండెంట్ ఎం.నాగబాబు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత నాడు నేడు ద్వారా ఇన్నేళ్లకు విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. శనివారం స్థానిక ఎంఎంకేఎస్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో 27 వేల కోట్లతో పాఠశాలలను ఆధునీకీకరిం చేసి ప్రభుత్వ పాఠశాలలంటే బయపడే పరిస్థితి నుండి నేడు హౌస్‌పుల్ బోర్డులు పెట్టే స్థాయికి తీసుకువచ్చారన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం ఎంతో అవసరమని గ్రహించి జగనన్న గోరుముద్ద మధ్యాహ్న బోజన పథకం ద్వారా విద్యార్థులకు మెరుగైన ఆహారాన్ని పాఠశాలల్లో అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అడ్డాల వెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు పడాల రాజ్‌కుమార్, పి.దర్మారావు, జి లక్ష్మీనారాయణ, ఎస్.సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్ను విజయ్, గంటా నరేష్, పాలపర్తి కృపానాథ్, పిల్లా శ్రీను, త్సవటపల్లి కృష్ణమోహన్, దొంగ హరికృష్ణ, షేక్ వల్లి, కొండా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఛాంబర్స్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శనివారం కళాశాల ఆవరణలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం భోగి మంటలు వెలిగించి డూడూ బసవన్నలు, గంగిరెద్దు ఆటలు, గరగల నృత్యాలు, ఎడ్లబండ్లు, వరికంకులు, గాదులు వంటి తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను తెలియపరిచేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు తయారు చేసిన రకరకాల పిండి వంటలు ప్రదర్శన, విద్యార్థుల కోలాటం, గొబ్బెమ్మల అలంకరణ, బొమ్మల కొలువు, పొట్టేలు, ఆవుదూడలు, కోడి పుంజులు ప్రదర్శన సాంప్రదాయ దుస్తులతో విద్యార్థుల ప్రదర్శనలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు భోగి మంటలు వెలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ కె. రామరాజు, ట్రెజరర్ జల్లూరి రామలింగేశ్వరరావు, అకాడమిక్ అడ్వైజర్ ఏబీఎస్ మూర్తి, వినుకొండ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్య శిక్షణ తరగతులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన నైపుణ్య శిక్షణా తరగతులు శనివారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఆరు రోజులు పాటు నిర్వహించారన్నారు. ఇందులో ప్రొఫెషనల్ ఎథిక్స్, సోషల్ మానర్, టైమ్ మేనేజ్‌మెంట్, మనీ మేనేజ్మెంట్, ఇంటర్వ్యూ స్కిల్స్ వంటి వాటిపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణ వల్ల విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించవచ్చని తెలిపారు.